పల్లెల్లో.. పట్నం వైద్యం

- పీహెచ్‌సీలలో స్పెషాలిటీ వైద్య సేవలపై ప్రభుత్వం నిర్ణయం
- ప్రతీ వారం రెండు నుంచి మూడు రోజులు ఓపీ క్లినిక్‌లు
- అందుబాటులో ఉన్న డాక్టర్ల వివరాల సేకరణ
- పునరాలోచించాలని వైద్యుల సంఘాల డిమాండ్


నవాబ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మహబూబ్‌నగర్(వైద్య విభాగం), అక్టోబరు 29: గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ వైద్యసేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ప్రతీ పీహెచ్‌సీలో వారంలో రెండు, మూడు రోజులు స్పెషాలిటీ ఓపీ వైద్య సేవలు అందించేందుకు క్లినిక్‌లను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తుంది. ఈమేరకు అన్ని జిల్లాల డీఎంఅండ్‌హెచ్‌వోలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా జిల్లాల్లోని జనరల్ ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలు, జిల్లా ఆస్పత్రుల్లో స్పెషాలిటీ వైద్యులు ఎంతమంది ఉన్నారో వివరాలు సేకరించాలని ఆదేశాలు

- మిగతా 7వ పేజీలో..

న్యూస్ బాక్స్

ఎస్‌బీ కానిస్టేబుల్‌పై దాడి

కోస్గి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అగంతకులు దాడి చేయడంతో ద్విచక్ర వాహనం వదిలి కానిస్టేబుల్ పారిపోయిన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండలం సర్జాఖాన్‌పేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్థులు, ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేటకు చెందిన ఎస్‌బీ కానిస్టేబుల్ బంటు కృష్ణ తన ద్విచక్ర వాహనంపై కోస్గి నుంచి వెళ్తున్నాడు. సర్జాఖాన్‌పేట శివారులో ద్విచక్ర వాహనం ఆపి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా ఈ రాత్రి వేళ ఇక్కడ ఎందుకు ఆగావంటూ అక్కడే మద్యం తాగుతూ కూర్చున్న ముగ్గురు వ్యక్తులు అతన్ని అడ్డుకున్నారు. తాను ఎస్‌బీ కానిస్టేబుల్‌నని చెప్పినా వినకుండా మద్యం మత్తులో ఉన్నవారు దాడి చేశారు. దీంతో కృష్ణ తన ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. వెంటనే కోస్గి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు దాడి చేసిన వెంకటయ్య, చంద్రయ్యలను గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఓటుపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు ప్రాముఖ్యతపై యువతలో అవగాహన కల్పించి, అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో ఓటరు ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం అయ్యారు.

7


కురుమూర్తి ఆలయ ప్రధాన ద్వారం

కురుమూర్తి రాయుడికి.. కోటి దండాలు

- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

7

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.13 లక్షల నగదు, 18 సిగరెట్ కార్టన్లు స్వాధీనం
- నిందితులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారు : జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి

ఆస్తి చూసి రమ్మన్నారు.. కాజేసి గెంటేశారు

- తల్లిదండ్రులపై కన్నకొడుకుల దాష్టీకం
- గద్వాల జిల్లా మానవపాడు మండలం నారాయణపురం గ్రామంలో వెలుగు

6

నైతిక విలువలు నేర్పాలి

- పీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సబ్జెక్టుతో పాటు నైతిక విలువలు నేర్పించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ స్థాయి రాజనీతి శాస్త్రం కరికులంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 అమలు కోసం డిగ్రీ సిలబస్‌ను రివైజ్ చేసి, ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కరికులం మారుస్తామన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాంరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో.. సత్తా చూపాలి

- పోరాడితేనే సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజలు గుర్తించాలి
- అక్రమ కేసులు పెడితే భయపడం.. లీగల్ సెల్ ఏర్పాటు
- శ్రీధర్‌రెడ్డి హంతకులు నెలలు గడిచినా తేలకపోవడం దారుణం
- వనపర్తి సభలో మాజీ మంత్రి హరీశ్ రావు

6


సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పత్తి ఏరేందుకు కూలీల కొరత

- పొలంలోనే రాలిపోతున్న పంట - దిగాలు చెందుతున్న రైతులు


నర్వలో ఓ రైతు పొలంలో నేల పాలవుతున్న పత్తి

నర్వ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి ఎట్టకేలకు పండించిన పత్తిని ఏరేందుకు కూలీలు దొరక్కపోవడంతో పొలాల్లోనే కాపు రాలిపోతోంది. దీంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు, చేతికొచ్చిన పత్తి పంటను త్వరగా ఏరుకుని మార్కెట్‌లో విక్రయిద్దామనుకుంటే కూలీలు దొరక్క ఆయా గ్రామాల రైతులు దిగాలు చెందుతున్నారు. ఖరీఫ్ సాగులో అత్యధిక శాతం రైతులు పత్తిని సాగు చేశారు. గత కొన్నాళ్లుగా భారీ వర్షాల కారణంగా పత్తి చేనులో పూత, పిందె రాలిపోయి పంట దెబ్బతింది. చివరి దశలో కాసిన కాపును రైతులు ఎలాగోలా కాపాడుకున్నారు. ప్రస్తుతం చేతికొచ్చిన పంటను కూలీలతో తీయించి మార్కెట్లో విక్రయించి పెట్టిన పెట్టుబడులకు గాను తెచ్చిన అప్పులు తీర్చుకుందామనుకుంటె కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోందని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజు కూలి ఒక్కరికి నాలుగు వందలు



పత్తి తీయనికే ఒక్కో మనిషికి నాలుగు వందలు రోజు కూలి డిమాండ్ చేస్తున్నారు. అయినాకాని సకాలంలో కూలీలు దొరకడం లేదు. అత్యవసరమున్న రైతులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూలీలతో అడిగిన కాడికి కూలి ఇస్తూ పత్తులు తీయించుకుంటున్నారు. కొందరు అధిక కూలి ఇవ్వలేక, ఏరలేక కాసిన పత్తి చేనులోనే రాలి పోతున్నాయి. అటు మార్కెట్లో పత్తి ధర కూడా తగ్గుతూ పోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాం.

- అనంతరెడ్డి, రైతు, జక్కన్నపల్లె

కబడ్డీ పోటీలు ప్రారంభం

నారాయణపేటరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-17 బాలబాలికల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. హెచ్‌ఎం సునీత, ఏఎంసీ సెక్రటరీ నర్సిములు తదితరులు విద్యార్థులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 13 మండలాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మాస్‌లైన్ నాయకుడు బి.రాము, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాజు, బాలప్ప, కుర్మేష్, శ్రీనివాస్, పీడీలు నెల్సన్, నర్సింహారెడ్డి, రమణ, వెంకటప్ప, వెంకటేశ, వెంకటప్ప, బాల్‌రాజ్, సాయినాథ్, అనంతసేన, పారిజాత తదితరులున్నారు.


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం, తదితరులు

మెరుగుపడని అంతర్గత రహదారులు


ముడుమాల్ గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు లేక బురద మాయంగా మారిన వీధులు

- చిన్నపాటి వర్షానికే బురదమయంగా మట్టి రోడ్లు
- డ్రైనేజీలు లేక ఇబ్బందులు
- సమస్యలతో సతమతమవుతున్న గ్రామీణ ప్రాంత ప్రజలు


బురదమయంగా మారిన హిందూపూర్ నుంచి కృష్ణకు వెళ్లే బీటీ రోడ్డు

కృష్ణ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు అలంపల్లి, ముడుమాల్, కూస్నీ, అడవి ఖానాపూర్, తంగడిగి తదితర గ్రామాల్లో అంతర్గత రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో చిన్నపాటి ముసురు కురిసినా రోడ్లపైకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. దీనికితోడు మురుగునీరు బయటకు వెళ్లడానికి సరైన కాల్వలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతమున్న మట్టి రోడ్లు వర్షానికి బురదగా మారి రాత్రివేళల్లో వృద్ధులు, చిన్నారులు, మహిళలతో పాటు పాదచారులు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోరాడి సాధించుకున్న నూతన రాష్ట్రంలో నేటికీ పది సంవత్సరాలు అవుతున్నా గ్రామీణ ప్రాంత రోడ్లు మెరుగుపడలేదు. గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం పల్లెల్లోనే ఉండాలని గొప్పగా కలలు కన్నప్పటికి అవి కలలుగానే మిగిలిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, పాలకులు స్పందించి పల్లెల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం చేయాలని కోరుతున్నారు.


అడవిఖానాపూర్ నుంచి కున్సి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు

కళా ఉత్సవ్‌తో సృజనాత్మకత వెలుగు

- నారాయణపేట డీఈవో అబ్దుల్‌ఘని


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకత శక్తిని వెలికి తీసేందుకు ప్రభుత్వం కళా ఉత్సవ్ కార్యక్రమాలను నిర్వహిస్తుందని జిల్లా విద్యాధికారి అబ్దుల్‌ఘని అన్నారు. మంగళవారం నారాయణపేట బాలకేంద్రంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వివిధ పోటీలను నిర్వహించారు. ఈ ఉత్సవాలను డీఈవో ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు కళలు నేర్చుకోని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి, జిల్లాకు పేరు తేవాలన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జీసీడీవో పద్మనళిని, సీఎంవో రాజేందర్ కుమార్, నాగర్జునరెడ్డి, యాదయ్యశెట్టి, బాలకేంద్ర సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి విద్యార్థినులు

క్లాసికల్ డ్యాన్స్‌లో మరికల్ గురుకులం నవనీత, నిడ్జింత జడ్పీహెచ్‌ఎస్ లావణ్య, జానపద డ్యాన్స్‌లో మద్దూరు కేజీబీవీ కృష్ణవేణి గ్రూప్, డ్రామా విభాగంలో నిడ్జింత జడ్పీహెచ్‌ఎస్ లావణ్య, కన్మనూర్ జడ్పీహెచ్‌ఎస్ అభిరామ్ గ్రూపు, విజువల్స్ 2డీలో మక్తల్ కేజీబీవీ పావని, నర్వ కేజీబీవీ భానుప్రియ, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్‌లో పెద్దచింతకుంట జడ్పీహెచ్‌ఎస్‌లో మేఘనాథ్ ఎంపికైయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరుకు గోల్డెన్ చాన్స్

- పీయూకు ఇంజనీరింగ్, లా కళాశాలలు మంజూరుకావడం హర్షణీయం
- వర్సిటీని పేరుగాంచిన ఐఐటీలతో టైఅప్ చేయిస్తాం
- నేడు యూనివర్సిటీలో సీఎంకు అభినందన సభ
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

6



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విక్రయానికి ఉంచిన దీపాంతలు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రమిదలు కొంటున్న పట్టణవాసులు

మొదలైన దీపావళి సందడి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దీపావళి సందడి మొదలయ్యింది. ఈ పండుగకే ప్రత్యేకమైన ప్రమిదల విక్రయ కేంద్రాలు జనంతో సందడిగా కనిపిస్తున్నాయి. దేవతా మూర్తులు, పువ్వులు, దేవకన్యల ఆకృతుల్లో ఉన్న ప్రమిదలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పట్టణాల్లో బాణ సంచా దుకాణాలు కూడా వెలిశాయి. ప్రమాదలు, టపాకాయల కొనుగోలుదారులతో మార్కెట్ సందడిగా కనిపిస్తోంది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు , మహబూబ్‌నగర్/వనపర్తి



విక్రయానికి ఉంచిన ప్రమిదలు, కుండలు, బొమ్మలు



వనపర్తిలో విక్రయానికి ఉంచిన వివిధ రకాల ప్రమిదలు



మహబూబ్‌నగర్‌లో బాణసంచా కొంటున్న యువకులు



మహబూబ్‌నగర్‌లో విక్రయానికి బాణసంచా



మహబూబ్‌నగర్‌లో విక్రయానికి ఉంచిన బొమ్మలు



వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు



వనపర్తిలో విక్రయానికి ఉంచిన బాణసంచా

స్థానిక సంస్థల్లో సత్తా చూపాలి



రైతు డిక్లరేషన్, ఆరు గ్యారెంటీల అమలేదీ? అంటూ సభలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మహబూబ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్ నాయకుల సత్తా ఏంటో స్థానిక సంస్థల్లో చూపించాలని, పోరాడితేనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయనే విషయాన్ని గుర్తించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కార్యకర్తలకు సూచించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రైతాంగ నిరసన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని, కానీ తాము భయపడే ప్రసక్తి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని, ఇప్పటివరకు భర్తీ చేయలేదన్నారు. పేద, దళిత విద్యార్థులను ఓపెన్ కోటాలో మెరిట్‌గా ప్రయత్నించడానికి లేకుండా జీవో 29ని తెచ్చారన్నారు. దానిపై ప్రశ్నిస్తే ఇష్టారీతిన కొడుతున్నారని అన్నారు. పోలీసులు అతి చేస్తున్నారని, వారి పేర్లు డైయిరీలో రాసుకుంటున్నామని చెప్పారు. వనపర్తి జిల్లా చిన్నంబావిలో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య జరిగితే.. ఇప్పటివరకు హంతకులను గుర్తించడం లేదని మండిపడ్డారు. వనపర్తి జిల్లా ఒకప్పుడు వలసల ప్రాంతంగా ఉండేదని, 10 వేల ఎకరాలు సాగైతే గొప్పగా ఉండేదన్నారు. ఆ ప్రాంతంలో కేసీఆర్ హయాంలో దాన్ని 1.10 లక్షల ఎకరాలకు పెంచామన్నారు. వనపర్తిలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ, మెడికల్, నర్సింగ్, అగ్రికల్చర్, ఫిషరీష్ కళాశాలలను తెచ్చి.. విద్యార్థులు హైదరబాద్‌కు పోయే అవసరం లేకుండా నిరంజన్‌రెడ్డి చేశారని అన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమైనా మార్పు వచ్చిందా? అని అడిగారు. ఉద్యోగులకు పీఆర్‌సీ లేదని, సరెండర్ లీవులను కూడా తగ్గించారని అన్నారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని అడిగిన వ్యక్తి సీఎం అయిన తర్వాత ఒక పంటకు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు.

సీటు కాపాడుకోడానికి పీఆర్‌ఎల్‌ఐ బంద్ చేశారు: సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

తన ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి.. నల్గొండకు మేలు చేసి, సొంత జిల్లాకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తే రైతులకు నీరు అందేదని, కానీ పాలమూరు బంద్ పెట్టి.. ఎస్‌ఎల్‌బీసీకి సహకరిస్తున్నారని మండిపడ్డారు. పాలమూరు బిడ్డ అని చెప్పి, దేవుళ్ల మీద ఒట్లు వేసి, అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రజలందరినీ ఏకబిగిన మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఏ వర్గానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారని చెప్పారు. ఇష్టం ఉన్నా లేకున్నా.. భరించాలని ప్రజలు భావిస్తున్నారని, అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో మోసకారి పార్టీని నామరూపాలు లేకుండా చేయాలని కోరారు. స్థానిక పదవులు, ఉద్యోగాలు మంత్రి పెత్తనంతో పక్క ఊర్లకు పోతున్నాయని, విదురుడు లాంటి చిన్నారెడ్డి అన్నీ తెలిసి పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. వివిధ రకాల ప్రభుత్వ సంస్థల కోసం 200 ఎకరాలు తీసుకుంటే.. అక్కడ సాగుచేసుకునే పేద రైతులకు కొంత స్థలం ఇస్తే.. దాన్ని ఎన్‌వోసీ తెచ్చేలోపే ఎన్నికలు వచ్చాయని, ఇప్పుడు సదరు రైతులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోమని అన్నారు. జర్నలిస్టుల ప్లాట్లను కూడా తొలగించారని, వారికి కూడా ప్లాట్లు దక్కాలని కోరారు.

ఎవరూ సంతోషంగా లేరు: వి.శ్రీనివాస్‌గౌడ్

ఎన్నో కల్లబొల్లి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. పది నెలల పాలన పూర్తి చేసుకున్నా రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు- రంగారెడ్డి పనులు 90 శాతం పూర్తి కాగా, ఇప్పటికీ పదిశాతం పనులు చేయకుండా కాంగ్రెస్ కాలయాపన చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో వివాహాలు చేసుకోకండి, రుణాలు తీసుకోండి అంటూ హామీలు ఇచ్చి, ఆ పథకాలు అమలు చేయకుండా.. రుణాలు మాఫీ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ప్రజలంతా తాము తీసుకున్న గుంతలో తామే పడ్డామని అనుకుంటున్నారని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో అంధుల ఇళ్లు కూల్చివేశారని, ఇదేమని అడిగి.. వారికి భరోసాగా నిలిబడినందుకు తన సోదరుడు శ్రీకాంత్‌ను జైల్లో పెట్టారని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, గువ్వల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పునరావాస పనులు

- డీఎఫ్‌వో రోహిత్ గోపిడి వెల్లడి



బాచారం అటవీ ప్రాంతాన్ని మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ అభయారణ్యంలోని గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అటవీ శాఖ జిల్లా అధికారి రోహిత్ గోపిడి వెల్లడించారు. జిల్లాలోని నల్లమల అప్పర్ ప్లాట్‌లో నివసిస్తున్న సార్లపల్లి, కుడిచింతల, బైలు, తాటిగుండాల, కొల్లంపెంట గ్రామాల ప్రజలకు మొదట విడతలో పెద్దకొత్తపల్లి మండలం బాచారం సమీపంలోని ఫారెస్టులో పునరావాసం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమ్రాబాద్, అచ్చంపేట, ఎంపీడీవోలు రామ్మూర్తి, తిరుమలరావు, నాలుగు గ్రామాల పునరావాస కమిటీ ప్రతినిధులతో కలిసి మంగళవారం డీఎఫ్‌వో బాచారం అడవిలో పునరావాస ప్రాంతాన్ని పరిశీలించారు. పులుల సంరక్షణ కోసం నల్లమలలోని నాలుగు గ్రామాలను మొదటి విడతలో బాచారం అటవీ ప్రాంతానికి తరలించినట్లు వెల్లడించారు. ఇందుకు నల్లమల అప్పర్ ప్లాట్ గ్రామాల ప్రజలు ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీకి అంగీకరించడంతో వారికి పునరావాసం కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. ఒక కుటుంబానికి రూ. 15 లక్షలు, 250 గజాలు నివాస స్థలం, అయిదు ఎకరాలు సాగు భూమి ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. రెండో విడతలో వటవర్లపల్లి గ్రామాన్ని బాచారం ప్రాంతానికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. బాచారం అటవీ ప్రాంతాన్ని సర్వే చేసి అందుకు సంబంధించిన రిపోర్టును కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ఈ అటవీ భూమిని రెవెన్యూ శాఖ మార్పిడి చేసిన తరువాత బాచారం అటవీ ప్రాంతంలో పునరావాస కేంద్రంలో వివిధ నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు డీఎఫ్‌వో వెల్లడించారు. మొదటి, రెండు విడతల్లో కలిపి మొత్తం 1,167 కుటుంబాలకు పునరావాసం కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పునరావాస పనులను రెండు, మూడు నెలల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. వీరి వెంట కొల్లాపూర్ ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్, డిప్యూటీ రేంజర్ రాణి, సెక్షన్ ఆఫీసర్లు ధర్మ, రామాంజనేయులు, ప్రశాంత్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ వెంకటేశ్, అప్పర్ ప్లాట్ పునరావాస గ్రామాలాభివృద్ధి కమిటీ చైర్మన్ సాయిబాబు ఉన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- రూ.2.50 లక్షలు కాజేసిన దుండగుడు

గద్వాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై సోమవారం రూరల్ పోలీసులు ఫిర్యాదు చేశారు. బాధితుడు అశోక్‌కుమార్ తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల మండలం వెంకంపేట గ్రామానికి చెందిన అశోక్ కుమార్ అదే గ్రామంలోని ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. వైద్య, ఆరోగ్యశాఖలో ఫీల్డ్ అసిస్టెంట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని ఎనిమిది నెలల క్రితం రూ.2.50లక్షల నగదు తీసుకున్నాడు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం ఉద్యోగం విషయంపై గట్టిగా అడుగగా మరో రెండు నెలల సమయం పడుతుందని తెలిపాడు. తనతో పాటు వినోద్ కుమార్ అనే యువకుడితో కూడా రూ.58వేలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగ విషయం తేలకపోవడంతో మోసపోయానని గ్రహించి సోమవారం గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ విషయంపై రూరల్ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నిస్తే ఆయన స్పందించలేదు.

ఆస్తి చూసి రమ్మన్నారు..

కాజేసి గెంటేశారు

- తల్లిదండ్రులపై కన్నకొడుకుల దాష్టీకం



దంపతులు భీమిరెడ్డి, పద్మమ్మ

మానవపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధ దంపతుల పరిస్థితి చూస్తే మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అనడం అతిశయోక్తి కాదేమోనని అనిపిస్తోంది. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని నారాయణపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నారాయణపురం గ్రామానికి చెందిన వేమారెడ్డి, వెంకమ్మ దంపతులకు లక్ష్మిరెడ్డి, భీమిరెడ్డి ఇద్దరు కుమారులు. వేమారెడ్డికి వారసత్వంగా 20 ఎకరాల 27 గుంటల భూమి ఉండేది. పెద్దకుమారుడైన లక్ష్మిరెడ్డి పెళ్లి కాకముందే మృతి చెందడంతో తండ్రి వద్ద ఉన్న ఆస్తి మొత్తం భీమిరెడ్డికి వారసత్వంగా సంక్ర మించింది. భీమిరెడ్డికి ముగ్గురు కుమారు లు, ఒక కూతురు వెంకట్రామ్‌రెడ్డి, లక్ష్మీ నారాయణమ్మ, వేణుగోపాల్‌రెడ్డి, జగదీష్ రెడ్డి ఉన్నారు. భీమిరెడ్డికి వారసత్వంగా వచ్చిన భూమిని ముగ్గురు అన్నదమ్ములు పంచుకొని ఎవరికి వారు జీవనం సాగిస్తున్నారు. భీమిరెడ్డి సొంతంగా మరో 3-28 గుంటల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిలో కొంత సాగునీటి కెనాల్‌కు పోగా.. మరికొంత విక్రయించా రు. 1-34గుంటల భూమి మిగిలింది. భీమిరెడ్డి భార్య పద్మమ్మకు పుట్టింటివారు 1-25 గుంటల భూమి ఇచ్చారు. ఈ భూమి భీమిరెడ్డి, పద్మమ్మల పేర ఉన్నది. తల్లిదండ్రుల పేరుమీద ఉన్న ఆస్తిపై కన్నేసిన చిన్న కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి తాను సాదుతానని తల్లిదండ్రులను తన వద్దే పెట్టుకున్నాడు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్ తీసుకుంటున్నాను.. నీ సంతకం అవసరం ఉందని తండ్రితో మాయమాటల చెప్పి స్టాంప్‌డ్యూటీ పత్రాలపై సంతకాలు చేయించుకొని 1-34 గుంటల భూమి జగదీశ్వర్‌రెడ్డి పేరుమీద మార్చుకున్నాడని తండ్రి భీమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 2019లో తల్లిదండ్రులను తానే జీవి తాంతం పోషిస్తానని, అందుకు ప్రతిఫలంగా పుట్టింటివారి నుంచి తల్లికి సక్రమించిన ఆస్తిని తల్లి పద్మమ్మ తదనంతరం సంక్రమించేలా పెద్దల సమక్షంలో ఒప్పందం చేసుకున్న రెండో కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి శాంతినగర్‌లో ఉన్న తన నివాసానికి తీసుకెళ్లాడు. నెల తిరగక ముందే పొలంపై లోను తీసుకుంటానని తల్లిని నమ్మించి తన భార్య వరలక్ష్మికి విక్రయించినట్లుగా సేల్‌డీడ్ ద్వారా మార్చుకున్నాడని తల్లి పద్మమ్మ వాపోతోంది. ఆ తర్వాత ఏదో వంకతో నిత్యం కొడుకు, కోడలు తమతో గొడవ పెట్టుకునే వారని, ఒకరోజు బయటకు గెంటేస్తే రెండు వారాలు అరుబయట ఉంటూ హోటల్ భోజనంతో కడపు నింపుకున్నామని వృద్ధ దంపతులు వాపోయారు. ఇరుగు పొరుగు వారి సాయంతో పోలీసు స్టేషన్‌కు వెళ్లామని, తర్వాత మళ్లీ గొడవపెట్టుకుని మందుతాగి చావాలని, లేదా నేనే సంపుతానని బెదిరిస్తే.. తాము ఇక బతకలేమని ఆత్మహత్య చేసుకుంటామని కూతురు లక్ష్మీనారయణమ్మతో విలపించినట్లు తెలిపారు. అల్లుడు జనార్దన్‌రెడ్డి సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎస్సై వేణుగోపాల్‌రెడ్డి దంప తులకు కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం లేకపోవడంతో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతో మానవపాడు తహసీల్దారు చొరవ తీసుకుని కొడుకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి చిన్నకొడుకు భాగానికి వచ్చిన పాత ఇంటిని ఇవ్వాలని, భృతి కింద ముగ్గురు కొడుకులు నెలకు రూ.9వేలు ఇవ్వాలని అదేశించారు. నివాసానికి ఇల్లు ఇచ్చారు.. కానీ భృతి మాత్రం అందడంలేదని, కూతురు అల్లుడే నెలకు భత్యం పంపి ఆదుకుంటున్నారని, ఇలాంటి కొడుకులు ఏ తల్లిదండ్రులకు ఉండరాదని, ఆ వృద్ధ దంపతులు ఆంధ్రజ్యోతి ముందు కన్నీరుమున్నీరయ్యారు.

గద్దర్ ఆశయాలు కొనసాగించాలి



కల్వకుర్తిలో గద్దర్ ఫ్లెక్సీకి నివాళి అర్పిస్తున్న ఆయన కూతురు వెన్నెల

కల్వకుర్తిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజాయుద్ధనౌక గద్దర్ ఆశయాలను కొనసాగించాలని గద్దర్ కూతురు వెన్నెల అన్నారు. మంగళవారం ఆమె కల్వకుర్తి పట్టణానికి వచ్చారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గద్దర్ ఫ్లెక్సీ వద్ద నివాళిఅర్పించి మాట్లాడారు. అభివృద్ధిఫలాలు కిందిస్థాయి వరకు అందాలని, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం పట్టణంలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి ఆనంద్‌కుమార్, నాయకులు సదానందంగౌడ్, వెంకటేశ్, గోరటి శ్రీను, రాజు, చిత్తారిశ్రీను పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

లింగాల అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కాలువలోకి స్కూల్ బస్సు దూసుకెళ్లగా పెను ప్రమాదం నుంచి విద్యార్థులు సురక్షితంగా బయటపడిన ఘటన మంగళవారం లింగాల మండలంలోని చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కేంద్రంలోని సెయింట్ పీటర్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు రాయవరం కొత్త చెరువుతండా సమీపంలో బస్సు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు ఎవరికి ఏమీ కాలేదు. సురక్షితంగా బయట పడ్డారు. కాలం చెల్లిన బస్సులను విని నడపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన ఉమ్మడి

జిల్లా స్థాయి స్పోర్ట్స్‌మీట్

- విజేత జట్లకు బహుమతుల ప్రదానం



విజేత జట్టు క్రీడాకారులతో ఆర్సీవో వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగమణి

కల్వకుర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని మహాత్మజ్యోతిబాఫూలే బీసీ బాలికల గురుకులంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ మంగళవారం ముగిశాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని 16 గురుకుల పాఠశాలలు, 8 కళాశాల నుంచి 1195 మంది విద్యార్థినులు క్రీడల్లో పాల్గొన్నారు. క్రీడల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు సాయంత్రం గురుకుల ఆవరణలో ప్రిన్సిపాల్ నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బహుమతులను ప్రదానం జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థినులు ఏకాగ్రత, పట్టుదలతో చదివి విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో ప్రతీ ఒక్కరికి మానసికోల్లాసం, శారీరక దారు ఢ్యాం వస్తుందని వివరించారు. కార్యక్ర మంలో నాగర్‌కర్నూల్ డీసీవో ప్రశాంతి, మహబూబ్‌నగర్ డీసీవో సుగుణశ్రీ, వాలీబాల్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ పాల్గొన్నారు.

పాలమూరుకు

గోల్డెన్ చాన్స్

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్య విషయంలో పాలమూరుకు గోల్డెన్ ఛాన్స్ వచ్చిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా వాసి కావడంతో ఈ ప్రాంతం రానున్న రోజుల్లో ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుందని చెప్పారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది నెలల పా టు శ్రమించిన ఫలితంగా పాలమూరు యూనివర్సిటీకి ఇంజనీరింగ్, లా కళాశాలలను ముఖ్యమంత్రి మంజూరు చేశారని తెలిపారు. భవనాల కోసం స్థలం చూశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. త్వరలోనే సీఎం చేత ఇంజనీరింగ్, లా కళాశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేయిస్తామన్నారు. పీయూకు కళాశాలలు మంజూరు చేసినందున బుధవారం ఉదయం 11 గంటలకు పీయూలో సీఎంకు కృతజ్ఞతగా అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పూర్తి స్థాయిలో ఎఫర్ట్ పెట్టి పీయూకు రూ.100 కోట్ల యూజీసీ నిధులు తేవడం జరిగిందన్నారు. దక్షిణ భారతదేశంలో రెండు యూనివర్సిటీలకు మాత్రమే కేంద్రం రూ.100 కోట్ల నిధులివ్వగా, అందులో మన యూనివర్సిటీ ఉండటం గమనార్హమన్నారు. దేశంలోనే పేరుగాంచిన హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ వంటి ఐఐటీలతో పాలమూరు వర్సిటీని టైఅప్ చేస్తామన్నారు. ఒక ఇంకుబేషన్ సెంటర్, హాస్టల్‌కు కూడా అనుమతి వచ్చిందని ఎమ్మెల్యే వెల్లడించారు. పీయూ ను దేశంలోనే పేరెన్నిక గల యూనివర్సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. పని అవుతుందంటే, పాలబూరుకు ప్రయోజనం కలుగుతుందంటే క్లర్క్ వద్దకైనా పదిసార్లు తిరుగుతానని, తనకు ఎలాంటి బేషజాలాలు లేవని స్పష్టం చేశారు. చిల్లర మల్లర రాజకీయాలు, ఓట్ల రాజకీయాలు చేయాలన్న అలవాటు, ఆలోచన కానీ తమకు లేదన్నారు. పాలమూరు అభివృద్ధికి సీఎం సహకారం అందిస్తున్నారని తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కోసం కూడా రూ.10 కోట్ల కు సంబంధించిన ఫైల్ సీఎం దగ్గర పెండింగ్ ఉందని, అది కూడా మంజూరు కానుందన్నారు. రూ.68 కోట్లు మంజూరు చేసి ఐటీఐని అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌గా అభివృద్ధి చేయనున్నామన్నారు. విద్య, రైతులన్నల సంక్షేమం, పాలమూరు భవిష్యత్తుపైనే తమ దృష్టి ఉందన్నారు. సమావేశంలో నాయకులు వినోద్‌కుమార్, లక్ష్మణ్‌యాదవ్, మల్లు నర్సింహ్మారెడ్డి, సిరాజ్‌ఖాద్రి, బెనహర్, రాములు యాదవ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



క్రీడాకారిణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో, పట్టణంలోని స్టేడియం మైదానంలో రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖోఖో టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతోంది. అందులో భాగంగా రెండవ రోజు పోటీలను మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్ గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో క్రీడలకు కనీస ప్రాధాన్యం కల్పించలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా క్రీడాకారుడు కావడంతో క్రీడా రంగానికి పెద్దపీట వేశారన్నారు. బడ్జెట్‌లో క్రీడా రంగానికి రూ.364 కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి వర్తమాన క్రీడాకారులను పోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. టోర్నమెంట్‌లో 10 జిల్లాలకు చెందిన 360 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, ఖోఖో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విలియం, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, ఖోఖో సంఘం కార్యనిర్వహక కార్యదర్శి బాల్‌రాజ్, శ్రీనివాసులు, మోగులాల్, నాయకులు జహీర్ అక్తర్, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

మంగళవారం జరిగిన పోటీల్లో విజేతల వివరాలిలా ఉన్నాయి. బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు ఖమ్మంపై 36-24, మెదక్ జట్టు కరీంనగర్‌పై 28-24, వరంగల్ జట్టు నల్గొండపై 30-20, రంగారెడ్డి జట్టు మహబూబ్‌నగర్‌పై 22-18 స్కోర్‌తో విజయం సాధించాయి. ఆదిలాబాద్ జట్టు హైదరాబాద్‌పై 24-14, మెదక్ జట్టు నిజామాబాద్‌పై 36-30 స్కోర్ తేడాతో గెలిచాయి. బాలికల విభాగంలో ఆదిలాబాద్ జట్టు ఖమ్మంపై 24-04, మెదక్ జట్టు కరీంనగర్‌పై 14-12, నల్గొండ జట్టు మహబూబ్‌నగర్‌పై 20-08, ఆదిలాబాద్ జట్టు నిజామాబాద్‌పై 36-02, రంగారెడ్డి జట్టు మెదక్‌పై 24-08 స్కోర్ తేడాతో విజయాన్ని సొంతం చేసుకున్నాయి.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్,ఉషూ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-14, 17, 19 బాల, బాలికల బాస్కెట్‌బాల్, ఉషూ జట్ల ఎంపికలు నిర్వహించారు. బాస్కెట్‌బాల్ ఎంపికలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి, ముక్రం, ఇలియాజ్ పాల్గొన్నారు.

కురుమూర్తి రాయుడికి కోటి దండాలు

- రేపటి నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు
- చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు
- రంగులు, విద్యుద్దీపాలతో ఆలయం ముస్తాబు
- జాతర మైదానంలో వెలుస్తున్న దుకాణాలు
- వచ్చే నెల ఆరున అలంకారోత్సవం, ఎనిమిదిన ఉద్దాలోత్సవం



కాంచన గుహలో కొలువుదీరిన స్వామి వారు



విద్యుత్ దీపాల వెలుగులో కురుమూర్తిస్వామి ఆలయ రాజగోపురం

చిన్నచింతకుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజల ఇలవేల్పు, పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న కురుమూర్తి వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 31 నుంచి యాగశాల మండపాలంకరణతో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో ప్రధానమైన కల్యాణోత్సవం రెండున, అలంకారోత్సవం ఆరున, ఉద్దాలోత్సవం ఎనిమిదిన నిర్వహించనున్నారు. అందుకోసం మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి, దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డిల నేతృత్వంలో దేవాదాయ శాఖ అధికారులు, పాలకవర్గంతో కలిసి జిల్లా కేంద్రంలో ఒకసారి, కురుమూర్తి ఆలయ ప్రాంగణంలో మరో సారి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారని, ఒక్క ఉద్దాలోత్సవం రోజే దాదాపు నాలుగు లక్షల మంది తరలిరానున్నారని అధికారులు అంచనా వేశారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.



స్వామి వారి పుష్కరిణి



కొండపైన మండపంలో ఉద్దాలు

పేదల తిరుపతిగా ప్రఖ్యాతి

అత్యంత పురాతనమైన కురుమూర్తి క్షేత్రం పేదల తిరుపతిగా ప్రఖ్యాతి గాంచింది. ఇక్కడి ప్రకృతి, వాతావరణం తిరుమల తిరుపతిని తలపిస్తుందని భక్తులు చెప్తుంటారు. అక్కడి మాదిరిగానే ఇక్కడ కూడా ఏడు కొండలున్నాయి. అందులోని దేవరగట్టుపైనున్న కాంచన గుహలో వేంకటేశ్వర స్వామి, లక్ష్మీ సమేతంగా స్వయంభువుగా కొలువుదీరి ఉన్నారు. తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రతీరూపమే ఇక్కడి స్వామివారని భక్తులు విశ్వసిస్తారు. కురుమూర్తిలో కొలువైన వేంకటేశ్వర స్వామి విగ్రహం తిరుపతి వేంకటేశ్వర స్వామి మూర్తిని పోలి ఉండటం విశేషం. తిరుమల కొండ ఎక్కేటప్పుడు స్వామి వారి పాదాలున్నట్లే కురుమూర్తిలోనూ స్వామి పాదాలు దర్శనమిస్తాయి. అక్కడ ఉన్నట్లే, ఇక్కడ కూడా ఆళ్వారుల విగ్రహాలున్నాయి. ముక్కెర వంశస్తులు సమర్పించిన బంగారు ఆభరణాలను అలంకారోత్సవం రోజున ఊరేగించి స్వామి వారికి అలంకరిస్తారు.

అప్పుల బాధ నుంచి తప్పించుకునేందుకు

స్వామి వారు కురుమూర్తి కొండపై వెలియడంపై ఆసక్తికరమైన కథనం ఒకటి ప్రచారంలో ఉంది. కుబేరుడి నుంచి అప్పుల బాధ నుంచి తప్పించుకునేందుకు స్వామి వారు లక్ష్మీ సమేతుడై తిరుపతి నుంచి ఉత్తరముఖంగా బయలు దేరాడు. దారిలో సుగంధ భరిత పుష్ప, ఫల వృక్షాలతో కురుమూర్తి గుట్ట కన్పించడంతో ఇక్కడ విశ్రమించినట్లు పురాణ గాథ. కురు అంటే 'చేయడం' అని, మతి అంటే 'తలచుట' అని అర్థం. అంటే స్వామి వారు ఇక్కడ ఉండాలని తలచటం, ఇక్కడే ఉండటం వల్ల స్వామి వారికి కురుమూర్తి అని పేరు వచ్చిందని స్థానిక పెద్దలు చెప్తుంటారు. ఇలా పద్మావతి సమేతంగా తిరుమలను వీడి, కృష్ణా తీరానికి చేరాడని, అక్కడ సేద తీరిన సమయంలో కృష్ణమ్మ పాదుకలను బహూకరిం చిందని ప్రతీతి. అవే ఉద్దాలని, ఏటా ఉత్సవాల సందర్భంగా నూతనంగా తయారు చేసి ఊరేగింపుగా క్షేత్రానికి తీసుకొచ్చి స్వామికి సమర్పిస్తారు.

క్షేత్రానికి చేరుకోవాలి ఇలా...

జిల్లా కేంద్రంనుంచి 50 కిలోమీటర్ల దూరంలో కురుమూర్తి ఆలయం ఉంది. మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర, కౌకుంట్ల మీదుగా కురుమూర్తి క్షేత్రానికి చేరుకోవచ్చు. కురుమూర్తి రైల్వేస్టేషన్ నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో స్వామి వారి ఆలయం ఉంది. జాతీయ రహదారిపై అయితే కొత్తకోట, దుప్పల్లి మీదుగా 18 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది. బ్రహ్మోత్సవాలకోసం క్షేత్రంలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జాతర మైదానంలో మిఠాయి దుకాణాలు, చిన్నారుల ఆట వస్తువుల దుకాణాలు ఏర్పాటు అవుతున్నాయి. ఇప్పటికే రంగుల రాట్నాలు, సర్కస్ టెంట్లు ఏర్పాటయ్యాయి.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

తెలంగాణా ప్రాంతంలో కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి, కర్ణాటకలోని రాయిచూరుతో పాటు, వివిధ ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. లక్షలాదిగా వచ్చే భక్తులకోసం ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి వసతి కోసం బోర్లు, నల్లాలు ఏర్పాటు చేశారు. ట్యాంకర్లతో పాటు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయం కోసం ప్రత్యేక క్యాంపులను సిద్ధం చేయనున్నారు. జాతరకు వచ్చే భక్తుల భద్రత కోసం పోలీస్ కంట్రోల్ రూంనుంచి సీసీ కెమరాలతో పర్యవేక్షించనున్నారు. దాదాపు 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు కాలక్షేపంతో పాటు, వారిని చైతన్య పరిచేందుకు కళాజాతాలు, నాటక ప్రదర్శనలు, సంగీత విభావరులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు.

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు



ఉమ్మడి జిల్లాతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తాగునీరు, వైద్యం తదితర సదుపాయాలను సిద్ధం చేస్తున్నాం. కోనేరు వద్ద భక్తుల రక్షణ కోసం గజ ఈతగాళ్లను నియమించనున్నాం. పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

\- మదనేశ్వర్‌రెడ్డి, ఈవో

కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు 179 ప్రత్యేక బస్సులు

- రీజినల్ మేనేజర్ శ్రీదేవి

మహబూబ్‌నగర్ టౌన్ (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి జాతరకు నవంబరు ఏడు నుంచి తొమ్మిదవ తేదీ వరకు రీజియన్ నుంచి 179 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడవ తేదిన 38, ఎనిమిదిన ఉద్దాలోత్సవం రోజు 103, తొమ్మిదిన 38 బస్సులను నడిపించనున్నట్లు పేర్కొన్నారు. ఏడు, తొమ్మిది తేదీల్లో అచ్చంపేట, గద్వాల, కల్వకుర్తి, షాద్‌నగర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను మినహాయించి, మిగతా డిపోల నుంచి నడిపించనున్నట్లు తెలిపారు. ఎనిమిదవ తేదిన ఉద్దాలోత్సవం ఉన్నందున, రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి బస్సులు నడుస్తాయని తెలిపారు. ఎనిమిదిన అచ్చంపేట, కల్వకుర్తి, గద్వాల, షాద్‌నగర్ నుంచి ఐదు, కొల్లాపూర్ నుంచి 10, మహబూబ్‌నగర్ నుంచి 20, నాగర్‌కర్నూల్ నుండి 20, నారాయణపేట నుంచి ఎనిమిది, వనపర్తి నుంచి 25 ప్రత్యేక బస్సులు ఉంటాయని పేర్కొన్నారు. అవసరం అయితే మరిన్ని బస్సులను కూడా నడిపిస్తామని తెలిపారు.

గత సంవత్సరం 177 బస్సు సర్వీసులు నడిపించగా, సంస్థకు రూ. 24.89 కోట్ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు. నాగర్‌కర్నూల్ నుంచి రూ. 200, వనపర్తి నుంచి రూ. 100, మహబూబ్‌నగర్ నుంచి రూ. 110, దేవరకద్ర నుంచి రూ. 60, ఆత్మకూర్ నుంచి రూ. 40, కురుమూర్తి రైల్వే స్టేషన్ నుంచి రూ. 30, కొల్లాపూర్ నుంచి రూ. 230, కొల్లాపూర్, బెక్కెంల నుంచి రూ. 250, కొల్లాపూర్, వీపనగండ్ల నుంచి రూ. 240, కొల్లాపూర్ కేతేపల్లి, వనపర్తిల నుంచి రూ. 200, పెబ్బేర్ నుంచి రూ. 110, కొత్తకోట నుంచి రూ. 70 చార్జీలను ఖరారు చేసినట్లు వివరించారు.

పోక్సో కేసులో నేరస్తుడికి కఠినకారాగార శిక్ష

- 20 వేల రూపాయల జరిమానా
- వెల్లడించిన ఎస్పీ యోగేశ్ గౌతమ్

ఊట్కూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో నేరస్తుడికి న్యాయాధికారి కఠిన కారాగార శిక్ష విధించారు. ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలోని ఒక గ్రామంలో బలిమొల్ల బలరాజ్ అనే యువకుడు 2020, ఆగస్టు 25న ఓ బాలికను ప్రేమ పేరుతో మభ్య పెట్టాడు. ఊరి చివరికి తీసుకెళ్లి అత్యాచార యత్నం చేయగా, బాలిక తప్పించుకొని ఇంటికి వచ్చి, అవమాన భారంతో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన తండ్రి బాలికను ద్విచక్ర వాహనంపై నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆమె స్పృహలోకి వచ్చి జరిగిన విషయాన్ని చెప్పింది. అనంతరం వైద్యుల సూచన మేరకు మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఈ మేరకు తండ్రి ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్‌ఐ ఎంఏ రషీద్ కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ శంకర్ దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ వేశారు. అనంతరం కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ్‌శ్రీధర్, ఆకుల బాలప్పలు వాదనలు వినిపించారు. ప్రస్తుత మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ కృష్ణంరాజు ఆదేశాలతో కోర్టు లెజనింగ్ అధికారి ఏఎస్‌ఐ కృష్ణయ్యగౌడ్, సీడీవోలు కబీర్, అబ్దుల్లా, అరవింద్‌లు మంగళవారం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బలమైన వాదనలు వినిపించడంతో నేరస్థుడు బలిమొల్ల బలరాజ్‌కు తొమ్మిది సంవత్సరాల, నాలుగు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు, 20 వేల రూపాయల జరిమాన విధిస్తూ జిల్లా న్యాయాధికారి ఎండీ రఫీ తీర్పునిచ్చారు. నేరస్తుడికి శిక్ష పడేలా పని చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఎస్పీ అభినందించారు. త్వరలోనే రివార్డులను ప్రకటిస్తామని తెలిపారు.

శబరిమలకు సూపర్ లగ్జరీ బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన సూపర్ లగ్జరీ బస్సులను సమకూర్చుతోందని రీజినల్ మేనేజర్ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సులో టీవీ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఇద్దరు మణికంఠ స్వాములు, ఇద్దరు వంట మనుషులు, సామాన్లు సర్దేందుకు ఒక వ్యక్తి బస్సులో ఉచితంగా ప్రయాణించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. బస్సును అద్దెకు బుక్ చేసిన గురుస్వామికి కూడా ఉచిత ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. ఒకటి కంటే ఎక్కువ బస్సులు బుక్ చేసిన గురుస్వామికి రోజుకు రూ. 300 చొప్పున కమిషన్ ఇస్తామని ఆర్‌ఎం శ్రీదేవి వివరించారు.

విద్యార్థిని చితకబాదిన ప్రిన్సిపాల్

జడ్చర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రెండవ తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ చితకబాదాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లిలో జరిగిన ఈ సంఘటన రెండు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని నవోదయ పాఠశాలలో గ్రామానికి చెందిన నిఖిల్ రెండవ తరగతి చదువుతున్నాడు. సోమవారం అతడిని స్కూల్ ప్రిన్సిపాల్ రాందాస్ చితక బాదడంతో వీపు అంతా కందిపోయింది. మంగళవారం విద్యార్థికి తల్లి స్నానం చేయిస్తూ, వీపుపై ఉన్న వాతలను గమనించింది. ఆరా తీయడంతో స్కూల్ ప్రిన్సిపాల్ రాందాస్ చితక బాదినట్లు విద్యార్థి తెలిపాడు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లగా, ప్రిన్సిపాల్ రాందాస్ లేక పోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. రెండు నెలల క్రితం కూడా ఓ విద్యార్థిని చితక బాదడంతో డీఈవో రవీందర్, ఎంఈవో మంజులాదేవి పాఠశాలకు వచ్చి విచారించారు. చర్యలు తీసుకుంటామన్నారు కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అందుకే మళ్లీ అలాంటి సంఘటనే జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాగా తరుచూ ఇలాంటి సంఘటనలు జరుగుతుండటంతో స్కూల్ అనుమతిని రద్దు చేయనున్నట్లు ఎంఈవో మంజులా దేవి తెలిపారు.



విద్యార్థి వీపుపై తేలిన వాతలు

క్రైం కార్నర్

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని మహిళ మృతి


జడ్చర్ల, అక్టోబరు 29 : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఓ గుర్తు తెలియని మహిళ (35) మృతి చెందింది. రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్లాట్‌ఫాంపై ఓ మహిళ పడి ఉండగా, స్టేషన్ మేనేజర్ గమనించి, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ అక్కడికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. ఆమె అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆనవాళ్లను బట్టి తెలుస్తోందని చెప్పారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మాజీ సర్పంచ్ మృతి

వంగూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మాజీ సర్పంచ్ మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని మిట్టసదగోడు మాజీ సర్పంచ్ సురేందర్ (43) కొంతకాలంగా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. లిఫ్టు మెకానిక్‌గా పని చేస్తున్న ఆయన ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యులు ఆయన మృత దేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దు

- నాలుగు గ్రామాల ప్రజల డిమాండ్
- తహసీల్దార్, ఎస్‌ఐలకు వినతి



మాన్‌దొడ్డిలో నిర్వహించిన సమావేశానికి హాజరైన నాలుగు గ్రామాల పెద్దలు

రాజోలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దని రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ, చిన్నధన్వాడ, నసనూరు, మాన్‌దొడ్డి గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. పెద్ద ధన్వాడలో ఈథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును పనులను గ్రామస్థులు, రైతులు అడ్డుకున్నారు. దీంతో 15 రోజుల పాటు పనులను నిలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం వారు ప్రత్యేక సమావేశం నిర్వహించుకున్నారు. ఫ్యాక్టరీ వల్ల పంటలు నాశనం అవుతాయని, ప్రజలు అనారోగ్యం పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రాజోలి మండల కేంద్రంలో తహసీల్దార్ రామ్‌మోహన్‌కు, ఎస్‌ఐ జగదీశ్వర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించుకోవాలని సూచించారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.13లక్షల నగదు, 18 సిగరెట్ కార్టన్లు స్వాధీనం
- నిందితులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారు : జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి

జడ్చర్ల, అక్టోబరు 29 : అంతరాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేసు వివరాలను వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని శ్రీరాం నగర్‌కాలనీలోని ఐటీసీ గోదాం (శ్రీ విఘ్నేశ్వర ఏజెన్సీస్)లో ఈ నెల 20న తెల్లవారుజామున సిగరెట్ కాటన్‌లు దొంగిలించిన ముఠాను పట్టుకున్నట్లు తెలిపారు. రూ.13.80 లక్షలతో 18 సిగరెట్ కార్టన్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మరో రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి రూ.7.90 లక్షల నగదును స్వాధీ నం చేసుకున్నట్లు వివరించారు. రాజస్థాన్ రాష్ట్రం, బయావర్ జిల్లా, జథరన్ తహసీల్ పరిధిలోని బిరోలి గ్రామానికి చెందిన మానిక్ చంద్ కుమావత్, బలుందా గ్రామానికి చెందిన కైలాష్ కుమావత్, బాంజికూరికి చెందిన గణపత్ కుమావత్‌లతో పాటు దినేష్ ఈ చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. వీరంతా హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు వలస వచ్చారని, వివిధ కిరాణం దుకాణాల్లో పని చేసేవారని తెలిపారు. ఆ సమయంలో సిగరెట్ల వ్యాపారాన్ని గమనించి, చోరీలకు దిగారు. హైదరాబాద్‌లోని లంగర్‌హౌజ్, సికింద్రాబాద్ మార్కెట్, కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో వీరిపై పలు కేసులు నమోదయ్యాయని తెలిపారు. తాజాగా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యిందని వివరించారు. గోదాంలు ఉన్న చోట రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతారని పేర్కొన్నారు. గణపత్ కుమావత్ అనే వ్యక్తి ఈ నెల 19న జడ్చర్లలోని ఐటీసీ గోదాం(విఘ్నేశ్వర ఏజెన్సీస్)లో చోరీ చేసేందుకు మాణిక్‌చంద్ కుమావత్, కైలాష్ కుమావత్, దినేష్‌లను కలిసి పథకం రూపొందించుకున్నారని తెలిపారు.

ఈ నెల 20న తెల్లవారుజామున మూడు గంటల సమయంలో వారు బొలేరో వాహనంతో గోదాం వద్దకు చేరుకున్నారని పేర్కొన్నారు. గోదాం షట్టర్‌ను ధ్వంసం చేసి, 32 సిగరెట్ కార్టన్లను ఎత్తుకెళ్లి హైదరాబాద్‌కు తీసుకెళ్లారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు బొలేరో వాహనంలో సిగరెట్ కార్టన్‌లను తరలిస్తుండగా, మల్లెబోయిన్‌పల్లి వద్ద పట్టుబడ్డారని తెలిపారు. వాహనంతో పాటు 28 సిగరెట్ కార్టన్లు, రూ.13.80లక్షలు, హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులో రూ.4.40, కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మరో కేసులో రూ.3.50లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మాణిక్‌చంద్ కుమావత్, కైలాష్ కుమావత్, గణపత్ కుమావత్‌లను అరెస్ట్ చేశామని, దినేష్ పరారీలో ఉన్నాడని వివరించారు. చోరీ కేసును ఛేదించిన జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐ మల్లేష్, కానిస్టేబుల్స్ విష్ణుమూర్తి, నరసింహరాజు, బాలచంద్రుడులను ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.

పల్లెల్లో పట్నం వైద్యం

- పీహెచ్‌సీలలో స్పెషాలిటీ వైద్య సేవలపై ప్రభుత్వం నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దీనిపై నివేదిక తయారు చేసి, ఆయా ఆస్పత్రుల సూపరిండెంటెండ్‌లకు పంపించారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో స్పెషాలిటీ సేవలు వద్దని, ఈ విషయంపై పునరాలోచించాలని ప్రభుత్వ వైద్యుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వైద్యుల వివరాల సేకరణ

మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలతో పాటు జడ్చర్లలో జిల్లా ఆస్పత్రి ఉంది. ఇందులో ఎంత మంది స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉన్నారో వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆయా ఆస్పత్రులకు ప్రతిపాదనలు పంపించారు. వారి నుంచి డాక్టర్ల వివరాలు వచ్చిన వెంటనే ఎంతమంది స్పెషాలిటీ డాక్టర్లు ఉన్నారు?, వారిని ఏయే పీహెచ్‌సీలకు పంపించాలి? ఏ వారం పంపించాలి అనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

12 రకాల స్పెషాలిటీ సేవలు

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 12 రకాల స్పెషాలిటీ ఓపీ సేవలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. అందులో గైనిక్ విభాగంలో గర్భిణుల ఆరోగ్యం, శిశు సంరక్షణ, కుటుంబ నియంత్రణ, సంతాన సాఫల్యత సేవలు ఉన్నాయి. అదేవిధంగా పిడియాట్రిక్ విభాగంలో నవజాత శివువుల ఆరోగ్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. జనరల్ మెడిసిన్ విభాగంలో సంక్రమిత వ్యాధులు, మందస్తు ప్యాలియేటివ్ ఆరోగ్య సేవలు, సర్జరీ విభాగంలో ఎమర్జెన్సీ సర్వీసులు, సైకియాట్రిక్‌లో మానసిక ఆరోగ్యం, ఈఎన్‌టీ, కంటి విభాగాల సేవలు ఉండనున్నాయి.

డాక్టర్ల కొరత

జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రులలో స్పెషాలిటీ డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. ఈ ఆస్పత్రుల్లో ఓపీ రోజుకు 1300 వరకు వస్తుండటంతో ఉన్న డాక్టర్లతోనే సరిపెడుతున్నారు. పీజీ వైద్యులు కూడా లేకపోవడంతో పీహెచ్‌సీలకు స్పెషాలిటీ వైద్యులను ఎలా పంపించాలని ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు ఆందోళన చెందుతున్నారు. డాక్టర్లను పంపించేందుకు రవాణా వ్యవస్థ ఎలా చేయాలి?, ఒక్క రోజు ఇంతమంది డాక్టర్లను ఎలా పంపించాలని వారు తర్జన భర్జన పడుతున్నారు.

పీహెచ్‌సీలలో స్పెషాలిటీ వైద్య సేవలు

జిల్లాలో మొత్తం 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఎదిర పీహెచ్‌సీ జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్నందున మిగతా 16 పీహెచ్‌సీలలో స్పెషాలిటీ ఓపీ వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం ప్రతీ వారం ఒక పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న స్పెషాలిటీ డాక్టర్లతో ఈ క్లీనిక్‌లను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కార్యచరణ రూపొందిస్తున్నారు.

పునరాలోచించాలని డిమాండ్

గ్రామీణ ప్రాంతాలలో స్పెషాలిటీ వైద్య సేవల వద్దని, దీనిపై పునరాలోచించాలని ప్రభుత్వ వైద్యుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులకు వినతి పత్రాలు కూడా సమర్పించారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి సేవలందించాలంటే కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, పనిభారం పెరిగి మానసికంగా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నాం

● తహసీల్దార్ జమీల్



మరికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తహసీల్‌కు వచ్చే రైతుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నావని తహసీల్దార్ జమీల్ తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ప్రతీరోజు కార్యాలయంలో ఎన్ని భూరిజిస్ట్రేషన్లు అవుతున్నాయి.

ఐదు నుంచి పది వరకు అవుతున్నాయి.

కార్యాలయంలో ఏ సమస్యలు ఉన్నాయి.

కార్యాలయంలో డీటీ, ఆర్‌ఐ ఉద్యోగులు లేరు. దీంతో కార్యాలయానికి వచ్చే రైతుల సమస్యలను సమయానికి పరిష్కరించలేకపోతున్నాం.

మండలంలో ఎన్ని రేషన్ దుకాణాలు ఖాళీగా ఉన్నాయి

అన్ని గ్రామాల్లో రేషన్ దుకాణాలు ఉన్నాయి. కేవలం మరికల్‌లో దుకాణం నెంబర్-1 ఖాళీగా ఉంది.

కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు మంజూరు చేస్తారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. అనుమతులు రావల్సి ఉంది.

ప్రజాపాలనపై స్పందన ఎలా ఉంది.

రైతులు, ప్రజలు వారివారి సమస్యలపై కార్యాలయానికి వస్తున్నారు. భూసమస్యలు అధికంగా ఉన్నాయి.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ కార్యాలయాలకు స్థల పరిశీలన

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం కొడంగల్ నియోజకవర్గ అధికారి వెంకటరెడ్డి స్థల పరిశీలన చేశారు. ప్రతీ గ్రామంలో అంగన్‌వాడీ పక్కా భవనాలు, నిడ్జింత గేటు వద్ద మండల సమీకృత భవనాల కోసం భూములను పరిశీలించారు. నిడ్జింత గ్రామంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేస్తామన్నారు. భూనీడు పాఠశాలలో ఐదు అదనపు గదుల నిర్మాణం, డైనింగ్ హాల్ కావాలని గ్రామానికి చెందిన కోట్ల మహేందర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నారాయణపేటరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పక్‌పల్లి గ్రామంలోని మారుతి మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ సదాశివారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసిన కలెక్టర్‌తో పాటు, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ కోణంగేరి హన్మంతు, డైరెక్టర్లు శరణప్ప, వెంకటయ్య, మార్కెట్ కార్యదర్శి, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం

మద్దూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన భీములును పరిషత్ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరారు. పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, ఎంపీడీవో నర్సింహారెడ్డి, ఎంపీవో రామన్న, అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ ధ్రువపత్రాల పంపిణీ

దామరగిద్ద, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అభయహస్తం కార్యక్రమంలో భాగంగా రూ.500కే సిలిండర్‌ను అందిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద లబ్ధిదారులకు గ్యాస్ ధ్రువపత్రాలను ఆయన అందించారు. కార్యక్రమంలో తుమ్మలి రఘు, ఆనంద్, నరసింహ, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నారాయణపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని టీయూసీఐ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ నవంబరు ఐదో తేదీన హైదరాబాద్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కాశీనాథ్, నరసింహ, సాబేరు, నయాం, బాలకృష్ణ, వెంకటేష్, బాల్‌రెడ్డి తదితరులున్నారు.

సాయిబాబా ఆలయంలో ఘనంగా హోమం

మద్దూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్దూర్ పట్టణంలో నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 61వ రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఘనంగా హోమ కార్యక్రమం నిర్వహించారు. అలాగే భక్తులు ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ట్రస్టు సభ్యులు వార్లసిద్దు లింగప్ప, నర్సింహాగౌడ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు ఖతం

» కబ్జాలు చేసి నిర్మాణాలు » వందల కోట్ల విలువైన భూములు స్వాహా » పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



మొరం వేసి చదును చేసిన ధర్మన్నకుంట చెరువు



చెరువులో విక్రయించిన ప్లాట్లు

మరికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువులు, కుంటలు మాయమ య్యాయి. కేవలం రికార్డుల్లో కనిపించే చెరువులు, కుంటలు భౌతికంగా మాత్రం వాటి జాడలేదు. జలం మనకు ప్రాణం.. చెరువులు, కుంటలు ఇందుకు ఆధారం. భూమిపుత్రులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు ఎంతో ప్రాధాన్యం కాగా.. నదులు లేని మరికల్ మండలంలో కాకతీయులు గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక అభివృద్ధి పేరిట కుప్పలు తెప్పలుగా వచ్చిన నిర్మాణాలతో చెరువులు, కుంటలు మరికల్ మండలంలో నామరూపాలు లేకుండా పోయాయి. కనుమరుగైన చెరువులు, కుంటల ఆక్రమణ లెక్క తేలాలంటే హైడ్రా రంగంలోకి దిగాల్సిందేనని ఇక్కడి ప్రజలు పట్టుబడుతున్నారు. హైడ్రా వస్తేనే జలవనరుల ఆక్రమణ లెక్క తేల్చవచ్చని సర్వత్రా డిమాండ్ చేస్తున్నారు.

కబ్జాలతో మాయం

మరికల్ మండలంలో భూముల విలువలు భారీగా పెరిగిన ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలను పాక్షికంగా అక్రమార్కులు కబ్జా చేశారు. ఇంకొందరు కుంటలను మొత్తానికి మొత్తంగా లేకుండా చేశారు. మండలంలో పెద్దచెరువు ఎఫ్‌టీఎల్‌లో 387.05 మీటర్లు, ధర్మన్నకుంట చెరువు ఎఫ్‌టీఎల్ 429, కంకల్ చెరువు ఎఫ్‌టీఎల్ 382, దొరలచెరువు ఎఫ్‌టీఎల్ 422, మెయిన్ చెరువు ఎఫ్‌టీఎల్ 412.20 మీటర్లు ఉంది. దాదాపు అన్ని చెరువుల్లో 30 నుంచి 50 శాతం వరకు ఆక్రమణకు గురైనట్లు రికార్డులో పొందుపరిచారు. అయితే వాటి విస్తీర్ణం, శిఖం నిర్ధారణ జరగలేదు. హద్దులు ఏర్పాటు చేయలేదు. అధికారం, పలుకుబడి వ్యవస్థను ఉపయోగించుకొని కొందరు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ మొదలగు నిబంధనలను తొక్కి వేసి శిఖం భూముల కబ్జాలకు పాల్పడ్డారు. క్షేత్రస్థాయిలో అధికార గణం సమగ్ర విచారణ చేస్తే చెరువుల విస్తీర్ణాలు, శిఖం భూములు రికార్డుల కన్నా తక్కువగా ఉంటాయి ధర్మన్నకుంట చెరువులో ఒకవైపు నీరు, మరోవైపు ప్లాట్లు, భవనాలు వెలిశాయి. చెరువు గండి పడితే పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకం. అలాగే పరిధిలోని అప్పంపల్లి గ్రామ ఊరచెరువులో కొందరు రాళ్లతో ప్రహరీ ఏర్పాటు చేసి కబ్జా చేశారు. చెరువు కింద ఆయకట్టు రైతులు పంట పొలాలు సాగు చేసుకోవడంతో చెరువులో ఎక్కువ శాతం నీరు నిల్వ లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదు..



ఇరిగేషన్ అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు చెరువులను కాపాడాలని పలుమార్లు జలసంరక్షణ సమితి ఆధ్వర్యంలో విన్నవించినా తూతూ మంత్రంగా సర్వే చేసి వెళ్లిపోవడమే తప్పా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నేడు చెరువులో దాదాపు 75 శాతం మొరం వేసి చదును చేశారు.

- బోదిగెల శ్రీనివాసులు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు

చెరువును కాపాడాలి..



మరికల్ మండలం 167 హైవే రహదారి పక్కన ధర్మన్నకుంట చెరువు ఉండడంతో మండలంలో భూముల విలువ పెరిగింది. కొందరు భూకబ్జాదారులు రాత్రికిరాత్రి చెరువులో మొరం వేసి చదును చేశారు. ప్లాట్లు చేసి అక్రమంగా విక్రయిస్తున్నారు. కబ్జాకు గురైన చెరువును ఉన్నతాధికారులు కాపాడాలి.

- పి.వెంకటేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలి

- సర్వే నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి
- వీసీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సీఎస్ శాంతికుమారితో కలిసి ఆయన వీసీ నిర్వహించి, మాట్లాడారు. వీసీలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరు కాగా, సమగ్ర కుటుంబ సర్వే విధివిధానాలను కేబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రతీ మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలన్నారు. సర్వే వివరాలు ప్రజలకు చేరేలా ప్రచారం చేయాలన్నారు. నవంబరు ఆరు నుంచి ఈ సర్వే ప్రారంభమవుతుందని తెలిపారు. రోజువారి సర్వే వివరాలను జిల్లా స్థాయికి ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ కలెక్టర్లు బాధ్యతగా సర్వే ప్రక్రియ పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. సర్వే పూర్తి అయిన ఇంటికి స్టిక్కర్ అతికించాలని సూచించారు.

అనంతరం కలెక్టర్ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణపై ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించి, మాట్లాడారు. 150 కుటుంబాలకు ఒక బ్లాక్‌గా విభజించి సర్వేను నిర్వహించాలన్నారు. 2011లో గుర్తించిన బ్లాక్‌లను ఆధారంగా చేసుకొని ప్రస్తుత కుటుంబాలను గుర్తించాలన్నారు. 75 అంశాల్లో వివరాలు సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. సర్వే అనంతరం డాటా ఎంట్రీ సైతం పక్కాగా ఉండాలని సూచించారు.

కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం

ఊట్కూర్: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ధనుంజయగౌడ్, ఎంపీవో రాజు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వచ్చేనెల నుంచి గ్రామాల వారీగా చేపట్టే సమగ్ర ఇంటింట కుటుంబ సర్వేపై వారు కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఎంపీఎస్‌వో చేతన్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- ఎంపీడీవో కార్యాలయం ముందు పంచాయతీ కార్మికుల నిరసన



ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఊట్కూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన్‌పల్లి రాము మాట్లాడుతూ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, పెన్షన్లు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుశాంత్, మండల కార్యదర్శి హన్మంతు, రైతు కూలీ సంఘం నాయకుడు చెన్నప్ప, కార్మికులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ రాములు

మక్తల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 3 నుంచి 5 వరకు నారాయణపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్‌బాల్ క్రీడల్లో నారాయణపేట జిల్లా బాలుర జట్టులో ప్రతిభ కనబర్చి నాలుగవ స్థానం పొందిన మక్తల్ మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులను షూటింగ్‌బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, గురుకుల ప్రిన్సిపాల్ రాములు ప్రశంసాపత్రాలతో అభినందించారు. విద్యార్థులు సాయితేజ, జయదీప్, చరణ్, ప్రశాంత్, రాజేష్‌శివ చరణ్, నవదీప్‌లు రాష్ట్ర స్థాయిలో నాల్గవ స్థానం పొందినట్లు వారు తెలిపారు.

ఒకే పోలీస్ విధానం అమలు చేయాలి

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం బెటాలియన్ కానిస్టేబుల్స్‌పై పనిభారం పెంచుతూ తీసుకొచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బెటాలియన్ కానిస్టేబుళ్లు, కుటుంబ సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

మక్తల్‌రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం భూత్పూర్ గ్రామంలో ధన్వంతరి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ధన్వంతరి వైద్యుడు నారాయణ చిత్రపటానికి పూజలు చేశారు. పాండు, నర్సింహులు, చిన్న నర్సింహులు, కిష్టప్ప, పెద్దనర్సింహులు, పెద్దబాలయ్య, కృష్ణయ్య, కండేప్ప, భాను, శేఖర్ తదితరులున్నారు.

డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వాహన డ్రైవర్లు డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆర్ ఎస్సై శివశంకర్ అన్నారు. మంగళవారం నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు జరిగిన ఒకరోజు శిక్షణనుద్దేశించి ఆర్‌ఎస్సై మాట్లాడారు. వాహనాల మెకానిజంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

విద్యార్థినులను వేధిస్తే చర్యలు

నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులను వేధిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని షీటీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య అన్నారు. మంగళవారం నారాయణపేట స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్‌ఫోన్ వినియోగం తదితర అంశాలపై వారు అవగాహన కల్పించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే 8712670398 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

మద్దూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ ఎంఐఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని భీంపూర్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణ తెలిపారు. గ్రామంలోని 90 మందికి దీర్ఘకాలిక వ్యాధులపై పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. సంస్థ సభ్యులు హాజమ్మ, నర్సింహ, లాలమ్మ, స్వాతి, శారద, మాధురి, శాలిని, శారద, శాంతకుమారి, పద్మ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దులు మృతి

మక్తల్‌రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిగండ్ల గ్రామానికి చెందిన రైతు తిరుమలమ్మకు చెందిన వ్యవసాయ పొలంలో రెండు కాడెద్దులు మేత మేస్తూ సమీపంలోని విద్యుత్ నియంత్రిక వద్ద తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందాయి. పశు వైద్య సిబ్బంది ఆంజనేయులు, మహేష్, పంచాయతీ కార్యదర్శి శైలజ, లైన్‌మెన్ సురేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాగనూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిసత్యారం గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై అశోక్‌బాబు తెలిపారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



సీఎంకు పూలమొక్క అందిస్తున్న శ్రీహరి

మక్తల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయబోయే కోర్టుకు ఫైనాన్స్ క్లియరెన్స్ అనుమతులు ఇవ్వాలన్నారు. అలాగే 150పడకల ఆసుపత్రికి నిధుల మంజూరు, డిగ్రీ కళాశాల, సమీకృత గురుకుల పాఠశాల, మక్తల్-నారాయణపేట రోడ్డు విస్తరణ తదితర అంశాలకు పాలనాపరమైన అనుమతులు, నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. కోర్టు ప్రారంభానికి త్వరగా చర్యలు తీసుకోవాలని మక్తల్ న్యాయవాదులు దత్తాత్రేయ, ఆడెం శ్రీనివాసులు, సూర్యప్రకాష్, రామ్మోహన్, రాజశేఖర్ తదితరులు కోరారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

- మద్దూర్, దామరగిద్ద మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఖాజీపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ భీములు

మద్దూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల రైతులు వినియోగించుకోవాలని కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు కోరారు. మంగళవారం మండలంలోని ఖాజీపూర్, చెన్నరెడ్డిపల్లి, అప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని, పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నర్సింహారెడ్డి, ఎంపీవో రామన్న, గుత్తి పురుషోత్తం, వీరారెడ్డి, హన్మిరెడ్డి తదితరులున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

దామరగిద్ద : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించుకొని మద్దతు ధర పొందాలని అయ్యవారిపల్లి గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుష్ప అన్నారు. మంగళవారం అయ్యవారిపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సన్న రకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఏ.చిన్నయ్య, బాలవర్ధన్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అరుణ్, శివప్ప, వెంకటయ్య, సునితమ్మ, వీబీకే మంజుల తదితరులున్నారు.

మత్స్యకారులకు అండగా ప్రజా ప్రభుత్వం



మరికల్ పెద్ద చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఏడీ, నాయకులు

మరికల్/ధన్వాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మత్స్యకారుల ఏడీ సయ్యద్ రహమాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మరికల్ పెద్దచెరువు, తీలేరు గ్రామంలోని చెరువులో మత్స్యశాఖ అధికారులతో కలిసి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత చేప పిల్లలను చెరువులో వదిలారు. అనంతరం వారు మాట్లాడుతూ గంగపుత్రుల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తోందని తెలిపారు. అదేవిధంగా, అన్ని కులవృత్తుల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, మత్స్యకారుల సంఘం మండల అధ్యక్షుడు కానుగంటి నారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా, ధన్వాడలోని పెద్ద చెరువులో మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి సరఫరా అయిన నాలుగు లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. నారాయణపేట మార్కెట్ యార్డు చైర్మన్ సదాశివారెడ్డి, చిట్టెం మాధవరెడ్డి, మత్స్యశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి నర్సిములునాయుడు ముదిరాజ్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు నీరటి రాంచంద్రయ్య, జట్రం లక్ష్మయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్లపై కూరగాయలు అమ్మొద్దు

- మునిసిపల్ కమిషనర్ నాగరాజు - క్రయ విక్రయదారులకు సూచనలు



కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

కోస్గి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై కూరగాయల క్రయ విక్రయాలు చేయొద్దని, వాహనదారులకు ఇబ్బందులు కల్గించొద్దని మునిసిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. మంగళవారం ఉదయం చేపల మార్కెట్ వద్ద రోడ్డుపై కూరగాయలు అమ్ముతున్న వారివద్దకు వెళ్లిన ఆయన పలు సూచనలు చేశారు. కూరగాయలను మార్కెట్‌లో లేకపోతే చేపల మార్కెట్ లోపల పెట్టుకొని అమ్మకాలు జరుపుకోవాలన్నారు. రోడ్లపై క్రయ విక్రయాలు చేస్తే వాహనదారులకు అంతరాయం కలుగుతుందని సూచించారు. ఇక నుంచి రోడ్లపై అమ్మకాలు చేపడితే మునిసిపల్ సిబ్బందితో తీసివేయిస్తానని హెచ్చరించారు.

మద్దతు ధరతో పాటు బోనస్ ప్రభుత్వమే ఇవ్వాలి

నారాయణపేటరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులు పండించిన పంటలన్నింటికీ మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏఐకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కోటకొండలో వారు కరపత్రాలను పంపిణీ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ స్వామినాథన్ సిఫారసులకనుగుణంగా కొనుగోళ్లు జరపాలన్నారు. సన్నరకానికే బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. ఖరీఫ్ రైతు భరోసాను ఇవ్వాలన్నారు. సమస్యలపై తహసీల్దార్ కార్యాలయాల ముందు బుధవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. సంఘం నాయకులు బి.నారాయణ, వెంకట్రాములు, సుభాష్, దస్తప్ప, భీమేష్, సలీం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక

నారాయణపేట/మద్దూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఉమ్మడి జిల్లా కరాటే ఉషూ పోటీల్లో పేట మాస్టర్ కేశవ్ అకాడమీ విద్యార్థినీ నందిని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి కరాటే ఉషు పోటీలకు ఎంపికైంది. అండర్-19 బాలికల విభాగం నుంచి నందిని రాష్ట్ర స్థాయి ఎంపిక కావడంపై అకాడమీ ఫౌండర్ కేశవ్‌గౌడ్, అబ్దుల్‌నబీ, కోచ్ అశోక్, నరేందర్‌లు అభినందించారు.

అదేవిధంగా, మద్దూర్‌లోని భాష్యం పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే ఉషు పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. అండర్-14 విభాగంలో కేదరినాథ్, వంశీతేజ, సాయి గణేష్, కార్తీక్, ప్రసన్న, శృతిలు ఎంపికైనట్లు వివరించారు. నారాయణపేట జిల్లా ఉషు కార్యదర్శి, మహ్మద్ సలీం, అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్, సలాంబిన్ ఉమర్, శారద ఆధ్వర్యంలో ఎంపిక జరిగిందన్నారు.